సాక్షి
చిత్తూరు
బుధవారం । 5 । ఏప్రిల్ । 2023



నిస్సహాయులపై 'వాత్సల్యం'

పలమనేరు: నిస్సహాయస్థితిలో.. పూట గడవడం కష్టమైన 18 ఏళ్లలోపు పిల్లలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టాయి. - 8లో



'డ్రిప్'తో సాగుదాం

తిరుపతి అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం రైతుకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. మెట్టప్రాంత రైతులకు బిందు సేద్య పరికరాలను రాయితీపై అందిస్తోంది. దీంతో పంట దిగుబడి పెరుగుతోంది. - 10లో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	37	23
తిరుపతి	36	23
తిరుమల	32	20
గూడూరు	38	26
నగరి	38	26

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం(సా)	సహర్ గురువారం(ఉ)
తిరుపతి	6.28	4.46
చిత్తూరు	6.30	4.46
పుంగనూరు	6.32	4.49

మత్తు దించేశారు!

అందివచ్చిన అవకాశాలను స్మగ్లర్లు అక్రమ వ్యాపారాల వైపు మళ్లించారు. గుట్టుచప్పుడు కాకుండా బస్సుల్లోనే సుదూర ప్రాంతాలకు వెళ్లి గంజాయి తెచ్చి విక్రయించడం ప్రారంభించారు. ఉత్తర భారతదేశానికి చెందిన పలువురు కూలీలకు, స్థానికంగా ఉన్న కొందరు వ్యాపారులకు విక్రయిస్తూ పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఒక్కరోజే 23 మంది స్మగ్లర్లు కటకటాలపాలయ్యారు. ఇందులో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు.



పట్టుబడిన గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

- గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా
- ఉమ్మడి జిల్లాలో పోలీసుల సోదాలు
- శ్రీకాళహస్తి, పలమనేరులో 23 మంది స్మగ్లర్ల అరెస్ట్
- స్మగ్లర్ల నుంచి భారీగా గంజాయి స్వాధీనం
- పలువురి స్మగ్లర్లపై పీడీ యాక్ట్ నమోదు

సాక్షి, తిరుపతి: మదక ద్రవ్యాలపై ఇటు పోలీసులు.. అటు ఎస్ఈబీ అధికారులు నిఘా పెట్టారు. ముఖ్యంగా గంజాయి అక్రమ రవాణా, క్రయవిక్రయాలపై దృష్టి సారించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో గంజాయి విక్రయించే వారిని అరెస్టు చేశారు. వారి నుంచి భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. శ్రీకాళహస్తి– బుచ్చినాయుడుకండ్రిగ రహదారి మార్గానికి ఆనుకొని ఉన్న రామచంద్ర మిషన్ వద్ద రూ.9 లక్షల విలువచేసే 22 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి 20 మందిని అరెస్ట్ చేశారు. వీరిలో ఎనిమిది మందిపై పీడీ యాక్ట్ నమోదు చేశారు. ఈ ఎనిమిది మంది గతంలోనే ముద్దాయిలుగా ఉన్నట్లు తిరుపతి జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న గంజాయి, అరెస్టయిన స్మగ్లర్లను మీడియాముందు ప్రవేశపెట్టారు. అవసరమైతే వీరిని జిల్లా నుంచి బహిష్కరించేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. అదేవిధంగా పలమనేరులో ముగ్గురు స్మగ్లర్లను అరెస్టు చేసి వారి నుంచి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గం'జాయ్'లో మునిగితేలుతున్న ఉత్తర భారతదేశ కూలీలు

గంజాయి ఎక్కడి నుంచి దిగుమతి అవుతుంది?.. ఆ గంజాయిని ఎవరెవరు వినియోగిస్తున్నారన్న దానిపై ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాలతో తిరుపతి జిల్లా పోలీసులు నిఘా పెట్టారు. గంజాయిని నార్త్ ఇండియా నుంచి వచ్చిన కూలీలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరికి గంజాయి ఎక్కడ నుంచి వస్తోంది? ఎలా వస్తోంది? అనే విషయాలపై అడిషనల్ ఎస్పీ రాజేంద్ర, కులశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వివరాలు సేకరించారు. పూర్తిగా నిర్ధారణ చేసుకున్న తర్వాత జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా శ్రీకాళహస్తికి చెందిన నాగేంద్ర అనే వ్యక్తి పట్టుబడ్డాడు. ఇతని సొంతూరు రాపూరు మండలం, గొండవోలు గ్రామం. గంజాయిని అరకు నుంచి తెప్పించుకొని పరిసర ప్రాంతాలలో సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. అదేవిధంగా దిగుమతి చేసుకున్న గంజాయిని చెన్నై, కేరళకు కూడా సరఫరా చేస్తున్నట్లు తేల్చారు. నాగేంద్ర ద్వారా స్మగ్లర్లందరినీ అదుపులోకి తీసుకున్నట్లు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి వివరించారు. వీరే కాకుండా ఇంకా చాలామంది ఉన్నారని, వారిని కూడా త్వరలో పట్టుకుంటామని స్పష్టం చేశారు.

నర్సీపట్నం నుంచి ఉమ్మడి జిల్లాలోకి

పలమనేరు: పలమనేరు, గంగవరం పోలీసులు మంగళవారం పది కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికిప్రధాన కారణమైన సలీం అనే కీలక వ్యక్తితోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన నిందితుల సమాచారంతో సరుకు నర్సీపట్నం నుంచి వస్తున్నట్టు గుర్తించారు. విశాఖ జిల్లా నర్సీపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఒడిసాల్లోని బరంపురం ప్రాంతాల నుంచి వస్తున్నట్టు పోలీసులు నిర్ధారించారు. ఇచ్ఛాపురం నుంచి 16వ నంబరు జాతీయ రహదారి మీదుగా నెల్లూరు, తిరుపతి బైపాస్, చిత్తూరు బైపాస్, పలమనేరు మీదుగా కర్ణాటక రాష్ట్రంలోకి అక్రమరవాణా సాగుతోంది.



మూడు రోజుల క్రితం చెత్తపెంట వద్ద గంజాయితోటను గుర్తించిన పోలీసులు

సమాచారం ఇవ్వండి



మాదక ద్రవ్యాల క్రయవిక్రయాల గురించి 14500 లేదా 100కి ఫోన్ చేసి సమాచారం అందించండి. మాదక ద్రవ్యాల నివారణలో పోలీస్‌శాఖకి సహకరించండి. మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం. పిల్లల నడవడికలపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు ప్రత్యేక పర్యవేక్షనలో ఉంచాలి.

– పరమేశ్వర్‌రెడ్డి, తిరుపతి జిల్లా ఎస్పీ

కింగ్‌పిన్లపై దృష్టి



గతంలోనూ ఇచ్ఛాపురం నుంచి బెంగళూరుకు తరలిస్తున్న గంజాయిని పట్టుకున్నాం. ఈ ప్రాంతంలో పట్టుబడుతున్న సరుకు నర్సీపట్నం, శ్రీకాకుళం, విజయనగరం, ఇచ్ఛాపురం ప్రాంతాల నుంచి వస్తోంది. తాజాగా పట్టుబడిన స్మగ్లర్ సలీం ఇచ్చిన సమాచారంతో విచారణ చేపడుతున్నాం.

– సుధాకర్‌రెడ్డి, డీఎస్పీ, పలమనేరు

ఆ స్మగ్లర్ బస్సుల్లోనే ప్రయాణం

స్మగ్లర్ నాగేంద్ర గతంలో ఎర్రచందనం దుంగలను తరలిస్తూ పట్టుబడ్డాడు. ఇతనిపై తొట్టంబేడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇతను తిరుపతిలో ఎనిమిదేళ్లు జీప్ డ్రైవర్‌గా పనిచేశాడు. శ్రీకాళహస్తి, వెంకటగిరి, రేణిగుంట, చిత్తూరు, తిరుపతి టౌన్, చెన్నై, కర్ణాటకలోని కోలార్ తదితర ప్రదేశాల్లో గంజాయి సరఫరా చేయడానికి ఒప్పందం కుదుర్చుకునేవాడు. విశాఖపట్టణం, ఇతర ప్రదేశాల నుంచి పెద్ద ఎత్తున గంజాయిని తీసుకొచ్చేవాడు. ఎవ్వరికీ అనుమానం రాకుండా బస్సులోనే ప్రయాణం చేసేవాడు. ఎప్పటిలాగే సోమవారం కూడా విశాఖపట్నం నుంచి బస్సులో గంజాయి తీసుకొచ్చి శ్రీకాళహస్తిలో విక్రయిస్తూ పోలీసులకు దిరికిపోయాడు. ఈ మేరకు శ్రీకాళహస్తి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పట్టుబడ్డ స్మగ్లర్లలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు.

ఏడాదిలో 60 కేసులు

ఏడాది కాలంలో తిరుపతి జిల్లాలో గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 60 కేసులు నమోదవగా.. 215 మంది నిందితులను అరెస్టుచేశారు. 316 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

న్యూస్‌రీల్

ప్రొబేషన్ కోసం వీఆర్‌ఓల వినతి



డీఆర్‌ఓకు సమస్య విన్నవిస్తున్న వీఆర్‌ఓలు

చిత్తూరు కలెక్టరేట్ : ప్రొబేషన్‌కు అర్హత ఉన్నా ఆలస్యం చేస్తున్నారని, సమస్యను పరిశీలించి న్యాయం చేయాలని గ్రేడ్‌-2 వీఆర్‌ఓలు నాగేంద్ర, మహబూబ్‌బాషా, సునీత విన్నవించారు. మంగళవారం ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో వీఆర్‌ఏ నుంచి ఉద్యోగోన్నతి పొందిన 60 మంది గ్రేడ్‌-2 వీఆర్‌ఓలు సీపీటీ, సర్వే పరీక్షల్లో సైతం ఉత్తీర్ణత సాధించినట్లు వెల్లడించారు.

నేడు జగ్జీవన్ రామ్ జయంతి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవనంలో మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని బుధవారం అధికారికంగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరినారాయణన్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఉదయం తొమ్మిది గంటలకు గంగినేనిచెరువు వద్ద ఉన్న జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి అంబేడ్కర్ భవనం వరకు ర్యాలీగా సాగుతామన్నారు. జయంతి కార్యక్రమంలో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొననున్నట్లు వివరించారు.

శ్రమకు తగ్గ వేతనం తప్పనిసరి



డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : దినసరి కార్మికుల శ్రమకు తగ్గ వేతనం చెల్లించాలని డీఆర్‌ఓ రాజశేఖర్ ఆదేశించారు. మంగళవారం ఆయన కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఓంకార్‌రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాలల్లో దినసరి వేతనం కింద పనిచేస్తున్న వారిని మూడు కేటగిరీలుగా విభజించడం జరిగిందన్నారు. గత ఏడాది నిర్ణయించిన వేతనాలకు అదనంగా 5 శాతం పెంచి అందించాలని స్పష్టం చేశారు. ఇది 2024 మార్చి 31వ తేదీ వరకు అమలు చేయాలని సూచించారు. సమావేశంలో చిత్తూరు ఆర్డీఓ రేణుక, డ్వామా పీడీ గంగభవానీ, కాణిపాకం ఆలయం నుంచి ఏఈఓ రవీంద్ర బాబు, సహాయ కార్మిక శాఖ అధికారి జగదీష్ పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా వార్షికోత్సవం



తిరుపతి కలెక్టరేట్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: కొత్త జిల్లా ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా మంగళవారం కలెక్టరేట్‌లో సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి అధికారులు, సిబ్బందికి పంచిపెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ ఏడాది పూర్తయ్యి.. రెండో ఏడాదిలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో సిబ్బంది రెట్టింపు ఉత్సాహంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితోపాటు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, ఎస్సీ, బీసీ వేల్ఫేర్ జిల్లా అధికారులు చెన్నయ్య, భాస్కర్‌రెడ్డి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి చేరువలో పన్ను వసూలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని మొత్తం 697 పంచాయతీల పరిధిలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి చేరువలో పన్ను వసూలు ఉన్నట్లు డీపీఓ లక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడూత రూ.24.65 కోట్లకు గాను ఇప్పటి వరకు రూ.21.09 కోట్లు వసూలు చేసినట్లు వివరించారు. మరో రూ.3.55 కోట్లు వసూలు కావాల్సి ఉందని పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు గ్రామంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఎస్టీలు 6వ తరగతిలో ప్రవేశానికి దర ఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ దామోదర్‌నాయుడు తెలిపారు. ఎస్టీ విద్యార్థులు అర్హులని, ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపిక జరుగుతుందని, ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

శ్మశానాల స్థల సేకరణ వేగవంతం



మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్

సాక్షి, చిత్తూరు : జిల్లాలోని దళితవాడల్లో శ్మశాన వాటికల ఏర్పాటుకు స్థలాల సేకరణను వేగవంతం చేయాలని జేసీ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో ఆయన సమీక్షించారు. త్వరితగతిన స్థల ఎంపికలు పూర్తి చేయాలని, ఏమైనా అభ్యంతరాలుంటే ప్రత్యామ్నాయాలను చూడాలని సూచించారు. అలాగే రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సర్వే రాళ్లు నాటే ప్రక్రియ ముమ్మరం చేయాలని స్పష్టం చేశారు. అందులో భాగంగా మొదటి దశ సర్వే పూర్తయిన 134 గ్రామాల్లో నెలాఖరుకల్లా సర్వే రాళ్లు నాటాలన్నారు. 90 రోజుల్లో ఇంటి పట్టాల పంపిణీకి అనువైన స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

మానవీయ బంధాలే రాజకీయాలు



మొబైల్ ఐ సర్జికల్ యూనిట్ ప్రారంభోత్సవంలో మంత్రి రోజా

- మంత్రి రోజా

నగరి : రాజకీయాలు అంటే మానవీయ బంధాలే అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటే తనకు ప్రేరణని మంత్రి రోజా తెలిపారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయం వద్ద ఉచిత కంటి వైద్య శిబిరం, మొబైల్ ఐ సర్జికల్ యూనిట్‌ను ఆమె ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సర్వేంద్రియానాం.. నయనం ప్రధానమన్నారు. కళ్లు కనపడని వారికి చూపునిస్తే, ప్రపంచాన్నే ముంగిట నిలిపినట్లని చెప్పారు. కంటి సమస్యలకు చికిత్స చేయించుకునేందుకు దూరాభారం వెళ్లలేని, ఖర్చు భరించలేని వారి కోసం స్థానికంగానే అత్యున్నత వైద్యం అందుబాటులోకి తీసుకువచ్చామని వెల్లడించారు. శిబిరంలో రోజూ 300 మందికి కంటి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఇలా 8 రోజుల పాటు శిబిరం కొనసాగుతుందని చెప్పారు. అవసరమైన వారికి మొబైల్ సర్జికల్ యూనిట్‌లో ఆపరేషన్ చేస్తారని వివరించారు. శంకరనేత్రాలయ ప్రతినిధి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మంత్రి రోజా చొరవతోనే వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రూ.8.5 కోట్లతో సిద్ధం చేసిన మొబైల్ సర్జికల్ యూనిట్ ద్వారా దేశవ్యాప్తంగా క్యాంపులు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇప్పటి వరకు 11,447 మందికి ఆపరేషన్ చేశామని చెప్పారు. కార్యక్రమంలో నగరి, పుత్తూరు మున్సిపల్ చైర్మన్లు పీజీ నీలమేఘం, హరి, ఎంపీపీలు భార్గవి, దీప పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నాయకులు

నగరి :మండలంలోని ముడిపల్లి రామాపురంలో పలువురు టీడీపీ నేతలు, వారి అనుచరులు వైఎస్సార్‌సీపీలోకి మంగళవారం చేరారు. వీరికి మంత్రి రోజా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన మనోహర్‌నాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమైనట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి, ఎంపీపీ భార్గవి, ఆర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ తిరుమలరెడ్డి, నాయకులు సుదర్శనం నాయుడు, సర్పంచ్ ప్రకాష్, ఎంపీటీసీ సభ్యుడు కృష్ణన్ పాల్గొన్నారు.



మంత్రి రోజా సమక్షంలో పార్టీలో చేరుతున్న టీడీపీ నేతలు

జగనన్నతోనే మా ప్రయాణం

- డిప్యూటీ సీఎం నారాయణస్వామి

కార్వేటినగరం : కులాలు, మతాలు, పార్టీలకు అతీతంగా పేదల అభ్యున్నతికి కృషి చేసే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే ప్రయాణం సాగిస్తామని డిప్యూటీ సీఎం నారాయణస్వామి తెలిపారు. మంగళవారం కార్వేటినగరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. పార్టీని, జగనన్నను దెబ్బతీసేందుకు యత్నించే దుర్మార్గులతో కలిసే ప్రసక్తే లేదన్నారు. గతంలో వైఎస్సార్‌ను, తనను దూషించిన వారే ఇప్పుడు పదవుల కోసం జగనన్నను ఆశ్రయించారని, దళితులను అణగదొక్కేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీలను చిన్నచూపు చూస్తున్నవారికి తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. నీతిగా, నిజాయితీగా రాజకీయాలు చేసే తనను గతంలో మాజీ ఎమ్మెల్యే కుతూహలమ్మ, ఆర్ముగంతో తిట్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యపానాన్ని అదుపులో పెట్టిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. వేలకోట్ల రూపాయలకు అమ్ముడుపోయిన రామోజీరావు తన పత్రికల్లో అసత్యాలు రాయిస్తున్నారని మండిపడ్డారు. పెనుమూరు మండలానికి చెందిన ఓ నాయకుడిని నమ్మితే ఆయన టీడీపీ వారితో జతకట్టి తనపై బురద చల్లేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రాణమున్నంత వరకు జగనన్నతోనే ఉంటానని తెలిపారు. పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సుబ్రమణ్య ఆలయ కమిటీ అధ్యక్షుడు కేశవరెడ్డి, రాష్ట్ర యువత ప్రధాన కార్యదర్శి ధనంజయరెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ గోపి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

ఎర్రచందనం అక్రమ రవాణాపై నిఘా



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎఫ్‌ఓ చంద్రశేఖర్

రాపూరు:రాపూరు, ఉదయగిరి, ఆత్మకూరు పరిధిలోని అడవుల్లో ఎర్రచందనం అక్రమ రవాణా జరగకుండా నిరంతరం నిఘా పెట్టినట్టు నెల్లూరు జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. రాపూరు అటవీశాఖ కార్యాలయాన్ని మంగళవారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవుల్లో ప్రతి రోజూ రాత్రి కూంబింగ్ నిర్వహిస్తున్నామన్నారు. అడవుల్లో గట్ట నిఘా ఉండడంతో తమిళ కూలీలు వెనుదిరిగి వెళ్లి ఉంటారని చెప్పారు. అటవీశాఖ, పోలీసుశాఖ సమన్వయంతో గట్టి నిఘా ఉంచామన్నారు. వన్యపాణులు నీటికోసం గ్రామాల్లోకి వస్తుంటాయని, వాటికి హానికలిగించకుండా చూడాలని స్థానికులకు సూచించారు. అడవులకు నిప్పు పెట్టడం తగ్గిందన్నారు. ఆయన వెంట రేంజర్ రవీంద్రబాబు, భాస్కర్‌రెడ్డి, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

చీటింగ్ కేసులో మరో ఇద్దరి అరెస్ట్

చిత్తూరు అర్బన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి దాదాపు రూ.70 లక్షల వరకు నగదు కాజేసిన కేసులో మంగళవారం చిత్తూరు క్రైమ్ పోలీసులు మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వివరాలు.. అనిల్‌కుమార్ రెడ్డి, శివకుమార్ అనే ఇద్దరూ జాబ్ కన్సల్టెన్సీ పేరిట బెంగళూరులో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురు నిరుద్యోగులను మోసం చేశారు. దీనిపై తిరుపతికి చెందిన సాయిశ్రీనివాస్ అనే వ్యక్తి గత నెల ఎస్పీ రిషాంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. చిత్తూరు సీసీఎస్ సీఐ భాస్కర్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మార్చి 10న అనిల్‌కుమార్‌రెడ్డి, శివకుమార్‌ను అరెస్టు చేశారు. గుడిపాల మండలం బొమ్మసముద్రానికి చెందిన మహర్షి గౌతమ్ (25), తెలంగాణ రాష్ట్రం నల్గొండకు చెందిన తిరుమల వరప్రసాద్ (29) అనే ఇద్దరు మహర్షి గౌతం, వరప్రసాద్‌ను ప్రధాన నిందితులుగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. మేజిస్ట్రేట్ ఆదేశాలతో నిందితులను రిమాండ్‌కు తరలించారు.

జ్యూస్ అనుకుని యాసిడ్ తాగిన వృద్ధురాలు


చికిత్స పొందుతున్న కాంతమ్మ

రామకుప్పం: మండలంలోని తాండాల్లో మంగళవారం పొరపాటున జ్యూస్ అనుకుని ఓ వృద్ధురాలు యాసిడ్ తాగేసింది. వివరాలు.. ఇంటి క్లీనింగ్ కోసం కుటుంబసభ్యులు యాసిడ్ తెచ్చి పెట్టారు. దీన్ని జ్యూస్‌గా భ్రమపడి కాంతమ్మ(70) తాగేసి కడుపు మంటతో విలవిలలాడింది. కుటుంబీకులు వెంటనే వృద్ధురాలిని కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు. ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.



తిరువీధుల మెరసీ దేవదేవుడు!

తిరుమల శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు మంగళవారం ఉదయం శ్రీమలయప్ప స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా తిరుమాడ వీధుల్లో స్వర్ణరథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. గోవింద నామస్మరణతో భక్తులు స్వర్ణరథాన్ని లాగి తన్మయత్వం పొందారు. అనంతరం స్వామివారు వసంతోత్సవ మండపానికి వేంచేపు చేశారు. స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా సాగింది.

- తిరుమల

తడలో పర్యటించనున్న కేంద్రబృందం


డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ

తడ: ఓడీఎఫ్ వెరిఫికేషన్ నిమిత్తం కేంద్ర బృందం వచ్చే వారం ఓడీఎఫ్‌గా (బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామంగా) ఎన్నికైన కాదలూరు పంచాయతీలో పర్యటించనున్నట్టు డీఎల్‌పీఓ వెంకటరమణ తెలిపారు. ఈ బృందం రానున్న నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా డీఎల్‌పీఓ మంగళవారం కాదలూరులో పర్యటించి పరిస్థితులు పరిశీలించారు. ఈ సందర్భంగా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా సిబ్బందికి సూచించారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

గూడూరు: రైల్వేలైన్‌కు భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆర్డీఓ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆయన డివిజన్‌స్థాయి తహసీల్దార్లు, డీటీలు, ఆర్‌ఐలు, వీఆర్వోలతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన సాగరమాల ప్రాజెక్టు లబ్ధిదారులకు అందజేస్తున్న నష్టపరిహారం చెల్లింపులు ఏ మేరకు జరిగాయి తదితర విషయాలపై చర్చించారు. అలాగే నడికుడి- శ్రీకాళహస్తి బీజీ రైల్వే లైనుకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.

వైభవం.. స్నపన తిరుమంజనం


శేషవాహనంపై ఊరేగుతున్న స్వామి,అమ్మవార్లు

రాపూరు: పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామివారి వార్షిక వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు శ్రీవారి కల్యాణ మండపంలో నిత్యహోమం, 10 గంటలకు స్వామి వారి నందనవనంలో పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి పాలు, తేనె, చందనం, పసుపు, పెరుగు, కొబ్బరి జలాలతో అభిషేకం చేశారు.

శేషుడిపై నృసింహుడు

పెంచలకోన క్షేత్రంలో జరుగుతున్న వసంతోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామివారు ఉభయనాంచారులతో శేషవాహనంపై నరసింహ స్వామి విహరించి, భక్తులను కటాక్షించారు. స్వామి వారి అలంకార మండపంలో నరసింహస్వామి, ఆది లక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవీ ఉత్సవమూర్తులను కొలువు తీర్చి వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో అలంకరించి, మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. స్వామి అమ్మవార్లను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,820
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,560

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,000
రిటైల్ వెండి గ్రాము	రూ.76

భార్యను చంపిన టీచర్ అరెస్ట్


నిందితుడు ఢిల్లీరాజు

చిత్తూరు అర్బన్: నగరంలో ఇటీవల కలకలం రేపిన హిమబిందు హత్య కేసులో ఆమె భర్త ఢిల్లీరాజు (53)ను వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ వెనుక వైపున నిందితుడు సంచరిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ నరసింహరాజు తెలిపారు. సీఐ కథనం మేరకు.. ఈనెల 1వ తేదీన నగరంలోని కొంగారెడ్డిపల్లె విద్యానగర్‌లో ప్రైవేటు టీచర్‌గా పనిచేస్తున్న హిమబిందును ఆమె భర్త, ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఢిల్లీరాజు కత్తితో నరికి చంపి పారిపోయాడు. అనంతరం నిందితుడు ఎస్‌ఆర్‌పురం మండలం జీఎంఆర్ పురానికి వెళ్లి.. హత్యాయుధాన్ని శుభ్రం చేశాడు. రక్తపు మరకలతో ఉన్న తన దుస్తులను ఉతికి ఓ కవర్‌లో ఉంచున్నాడు. ఇప్పుడు పాపం పండి పోలీసులకు పట్టుబడ్డాడు. మేజిస్ట్రేట్ ఆదేశాలతో నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

బాలుడి అప్పగింత

నాయుడుపేటటౌన్: అదృశ్యమైన బాలుడి ఆచూకీని పోలీసులు కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణంలోని జైహింద్ కాలనీలో ఉన్న మధు కుమారుడు జయంత్ పట్టణంలోని ఓ ప్రైవేటు స్కూలులో నాలుగో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం స్కూల్‌కు వెళ్లి తిరిగి రాలేదు. పాఠశాలకు కూడ వెళ్లకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు భయాందోళలకు గురై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాయుడుపేట రూరల్ సీఐ వైవీ సోమయ్య సారథ్యంలో ఎస్‌ఐ శ్రీకాంత్ పోలీసు సిబ్బందితో పట్టణంలో గాలింపు చర్యలు చేపట్టి బాలుడి ఆచూకీ కొనుగొని, తల్లిదండ్రుల అప్పగించారు.

నేటి నుంచి సంగమేశ్వరుని బ్రహ్మోత్సవాలు


ముస్తాబైన సంగమేశ్వరాలయం

కోట: మండలంలోని గూడలిలో ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ మాలేపాటి భాస్కర్ రెడ్డి, ఈఓ శశాంక్‌కుమార్ మంగళవారం తెలిపారు. గూడలిలో స్వర్ణముఖి నది ఒడ్డున ఉన్న కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి ఆలయానికి పురాతన చరిత్ర ఉంది. ఈ నెల 5వ తేదీన అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని వారు తెలిపారు. పదిరోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 14వ తేదీ స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు వేలాదిమంది తరలివచ్చే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

నిస్సహాయులపై 'వాత్సల్యం'

అనాథ బిడ్డలను ఆదుకోవాలి.. నిస్సహాయులకు నీడగా నిలవాలి.. సంరక్షణ లేని పిల్లలకు భరోసా కల్పించాలి.. వీధి బాలలకు వెన్నుదన్నుగా ఉండాలి.. తల్లిదండ్రులను కోల్పోయిన వారి జీవనానికి సాయం చేయాలి. ఇదే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నడుం బిగించాయి. 2019 కోవిడ్ సమయంలో ఉన్నతమైన 'మిషన్ వాత్సల్య' పథకానికి రూపకల్పన చేశారు. సంయుక్త భాగస్వామ్యంతో ప్రతి నెలా రూ.4వేలు అందిస్తూ చేదోడుగా నిలుస్తున్నారు.

- పోషణ కరువైన పిల్లలకు ప్రభుత్వ సాయం
- కేంద్రం, రాష్ట్రం సంయుక్త భాగస్వామ్యంతో చేయూత
- మిషన్ వాత్సల్య కింద ప్రతి ఒక్కరికీ నెలకు రూ.4వేలు


పలమనేరు సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారిణులు

పలమనేరు: నిస్సహాయస్థితిలో.. పూట గడవడం కష్టమైన 18 ఏళ్లలోపు పిల్లలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిషన్ వాత్సల్య పథకం ప్రవేశపెట్టాయి. లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.4వేల ఆర్థిక సాయం అందిస్తున్నాయి. మహిళాశిశుసంక్షేమ శాఖ, బాలల సంక్షేమ రక్షణ విభాగం ద్వారా పకడ్బందీగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయి.

సంయుక్త భాగస్వామ్యంతో....

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తితో మిషన్ వాత్సల్యకు నిధులు కేటాయిస్తున్నాయి. ఈ మేరకు కేంద్రం రూ.2,400 రాష్ట్రం రూ.1,600 లెక్కన సమష్టిగా పంపిణీ చేస్తున్నాయి.

అర్హులు ఎవరంటే...

- వితంతువు, విడాకులు తీసుకున్న తల్లి, పిల్లలు
- భర్తను వదిలేసిన తల్లుల బిడ్డలు
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న వారి పిల్లలు
- కోవిడ్ కారణంగా తల్లిదండ్రులు దూరమైనవారు
- పేదరికంతో అమ్మానాన్న పెంచలేని వారు
- బాల న్యాయచట్టం మేరకు ఆదరణ అవసమైన చిన్నారులు
- బాల కార్మికులు, బాల్య వివాహాలు చేసుకున్న బాధితులు
- అక్రమరవాణాకు గురైన పిల్లలు



- హెచ్ఐవీ బాధితులైన తల్లిదండ్రులు గలవారు
- పారిపోయి, తప్పిపోయి, యాచకులుగా మారిన చిన్నారులు
- హింస, దోపిడీకి అనాథలుగా మారి అనాథాశ్రయాల్లోని పిల్లలు
- పీఎం కేర్‌ఫర్ చిల్డ్రన్స్ తదితరులు
- కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72వేలు, పట్టణాల్లో రూ.96వేలు మించని వారు ఈ పథకం కింద లబ్ధిపొందేందుకు అర్హులు.

దరఖాస్తు ఇలా..

అర్హులైన వారు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ వర్కర్ ద్వారా దరఖాస్తు పొందాల్సి ఉంటుంది. లేదా మీసేవా కేంద్రాలు, ఇంటర్‌నెట్‌లోనూ అప్లికేషన్ అందుబాటులో ఉంది. ఆ మేరకు అవసరమైన పత్రాలను జతపరిచి ఐసీడీఎస్ అధికారులకు దరఖాస్తు అందించాలి. ఈ మేరకు ఇప్పటికే ఆయా ప్రాజెక్టుల పరిధిలో సుమారు 200 వరకు దరఖాస్తులు వచ్చినట్లు సమాచారం.

అర్హుల ఎంపిక ఇలా..

దరఖాస్తుదారుల్లో లబ్ధిదారులను జిల్లా కమిటీ ఎంపిక చేస్తుంది. ఈ కమిటీలో మిషన్ వాత్సల్య ఛైర్మన్‌గా కలెక్టర్, జిల్లా మహిళా శిశుసంక్షేమ అధికారి, సీడబ్ల్యూసీ, డీసీపీఓ, ఎస్ఐసీపీఓ, ఎన్‌జీఓ సంస్థ నిర్వాహకులు సభ్యులుగా ఉంటారు.

సద్వినియోగం చేసుకోవాలి



అర్హులందరూ మిషన్ వాత్సల్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. లబ్ధిదారుల ఎంపికలో భాగంగా బాధిత చిన్నారులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్నాం. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పిల్లలను ఆదుకునే గొప్ప పథకం ఇది.

- ప్రతిమ, ఇన్‌స్టిట్యూషనల్ కేర్ ప్రొటెక్షన్ అధికారి, చిత్తూరు

అంగన్‌వాడీల ద్వారా దరఖాస్తులు



అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా మిషన్ వాత్సల్య పథకానికి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. సచివాలయ మహిళా పోలీసులు, వలంటీర్ల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. అవరమైన పత్రాలతో అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి.

- ఇందిరాప్రియదర్శిని, సీడీపీఓ, పలమనేరు